

శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను వెండిరథం పై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



శ్రీగిరి మల్లన్నా.. శరణు.. శరణు!

ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని వేలాది మంది భక్తులు తండోపతండాలుగా శ్రీగిరి చేరుకుంటున్నారు. శివనామస్మరణతో శ్రీశైల క్షేత్రం మార్మోగుతోంది.



నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: ధర్మపథంలో భాగంగా సోమ వారం నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన రమాదేవి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ కళాకారుల సంప్ర దాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:56
ఆదోని	సా॥ 6:33	ఉ॥ 4:54
నంద్యాల	సా॥ 6:31	ఉ॥ 4:56
ఆత్మకూరు	సా॥ 6:31	ఉ॥ 4:51
బనగానపల్లె	సా॥ 6:33	ఉ॥ 4:54

హదీస్ వెలుగు:

తప్పులు చేయడం అంటే కేవలం చేతులతోనే కాదు. మాటలు, చెవులు, చూపులతోనూ తప్పులు జరుగుతాయి. వాటన్నింటి నుంచి నియంత్రణలో ఉండాలి.

– పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

డెస్క్‌ల సమస్య పరిష్కారం

హొళగుంద: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మొదటి రోజు హొళగుంద జెడ్పీ హైస్కూల్‌లో డెస్క్‌ల సమస్య వచ్చిందని, సమస్య పరిష్కా రమైందని డీఈఓ శామ్యూల్ పాల్ తెలిపారు. హొళగుందలోని పరీక్ష కేంద్రాలను సోమ వారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాటాడుతూ.. జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగుతు న్నాయన్నారు. డీఈఓ వెంట ఎంఈఓ–1, 2 సత్యనారాయణ, జగన్నాథం ఉన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): ఏపీపీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు మార్చి 25, 26,27 తేదీల్లో జరగ నున్నాయని, పద్బం దీ ఏర్పాట్లు చేయాలని అధికారు లను జేసీ డాక్టర్ బి.నవ్య ఆదేశిం చారు. పరీక్షలపై కలె క్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో సోమవారం ఆమె సమీక్షించారు. కర్నూలులో ని డిజిటల్ అయాన్‌లో 25, 26 తేదీల్లో అసిస్టెంట్ ఎన్వి రాన్‌మెంట్ ఇంజినీర్ నియామక పరీక్షలు, ఎమ్మి గనూరులోనిసెయింట్ జోసెఫ్ డిగ్రీకళాశాలలో గ్రేడు–2 అనలిస్టు నియామక పరీక్షలు జరుగుతా యన్నారు. కర్నూలులోని ఆయాన్ డిజిటల్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టు కోసం 27న ఆన్‌లైన్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాల న్నారు. కలెక్టరేట్ ఏఓ విజయశ్రీ, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

'సిల్వర్‌జూబ్లీ'లో జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో సోమవారం జాతీయ సదస్సు ప్రారంభమైం ది. ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ అధ్య క్షత వహించారు. రెండు రోజుల పాటు ఈ సద స్సును నిర్వహించనున్నారు. క్లస్టర్ వర్సిటీ రిజి స్ట్రార్ డాక్టర్ కే వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై నిర్వహిం చిన సదస్సులో పలువురు మాట్లాడారు. సద స్సుకు 130 పత్రాలు వచ్చాయి. ప్రొఫెసర్లు డాక్టర్ ఎల్లా కృష్ణ, శ్రీనివాసమూర్తి, జి.చంద్ర శేఖర్, సిల్వర్‌జూబ్లీ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బీఆర్ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

వెలగని వ్యవసాయం!

విద్యుత్ కనెక్షన్లకు గ్రహణం

- తొమ్మిది నెలలు గడుస్తున్నా మంజూరులో జాప్యం
- ఇప్పటి వరకు ఇచ్చిన కనెక్షన్లు 1,474
- ఉమ్మడి జిల్లాలో 12,293 రైతుల నిరీక్షణ
- ఏడాది క్రితం డబ్బు చెల్లించినా నోరు మెదపని అధికారులు



విద్యుత్ కనెక్షన్ లేక నిరుపయోగంగా వ్యవసాయ బోరు

మాకు ఐదెకరాల భూమి ఉంది. రెండు బోర్లు ఉన్నాయి. వ్యవసాయ విద్యుత్ కనె క్షన్ కోసం ఏడాది క్రితం విద్యుత్ మా వాటా కింద రూ.18,600 చెల్లించాం. ఇప్పటి వరకు కనెక్షన్ ఇవ్వలేదు. పోల్స్, మెటీరియల్ కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. అదిగో ఇదిగో అని తిప్పి పంపుతున్నారు. బోర్లలో నీళ్లున్నా ఉపయోగించుకోలేకపోతున్నాం.

– కమ్మరి చిన్న రంగస్వామి, జిల్లేడుబుడకల గ్రామం, దేవనకొండ మండలం

మాకు ఎనిమిది ఎకరాల భూమి ఉంది. రెండు బోర్లు వేయించాం. 2023 డిసెంబ ర్‌లో విద్యుత్ కనెక్షన్ కోసం రైతు వాటాగా రూ.80 వేలు చెల్లించాం. ఇప్పటికి ఏడాది గడిచిపోయినా కనీసం పోల్స్ కూడా ఇవ్వ లేదు. నీళ్లు ఉన్నా కనెక్షన్ ఇవ్వకపోవడం తో భూములను ఖాళీగా ఉంచుకున్నాం. డోన్‌లోని డీఇ, ఏడీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం.

– ధర్మవరం సుబ్బరాయుడు, ఓబులదేవరపల్లి గ్రామం, ప్యాపిలి మండలం



ఈ చిత్రం మద్దికెర మండలం బసినేపల్లి గ్రామంలోనిది. బోర్లలో నీళ్లు పడినా రైతులు పంటలు పండించుకోలేని పరిస్థితి. ఆరేడుగురు రైతులు 14–15 నెలల క్రితం బోర్లు వేయించుకు న్నారు. బోర్లలో ఆశాజనకంగా నీళ్లు పడ్డాయి. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఏడాది క్రితం దరఖాస్తు చేసుకున్నారు. విద్యుత్ అధికారులు ఎస్టిమేట్లు వేశారు. రైతులు తమ వాటా మొత్తాన్ని డీడీ తీశారు. ఆ మేరకు పోల్ సరఫరా చేసి నాటారు. ఇతర మెటీరియల్ ఇవ్వకపోవ డంతో నీళ్లున్నా విద్యుత్ కనెక్షన్ లేక భూములను ఖాళీగా ఉంచుకున్నారు.

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాధారం కింద పంటల సాగు గాలిలో దీపంగా మారింది. బావులు, బోర్లలోని అంతంతమాత్రం నీటితో పంటలు పం డించుకోవాలని ఆశించిన రైతులకు నిరాశే మిగులు తోంది. వ్యవసాయ విద్యుత్ పట్ల కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారుతోంది. కొత్త విద్యుత్ కనెక్షన్ల కోసం వేలాది మంది రైతులు డబ్బు చెల్లించి కొన్ని నెలలుగా ఎదురు చూస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ ఇస్తే బోర్ల కింద కూరగాయల పంటలు, ఆరుతడి పంటలు సాగు చేసుకోవచ్చనే ఉద్దేశంతో రైతులు ఉన్నారు. అయితే కనెక్షన్ల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. విద్యుత్ అధికారులు వేసిన ఎస్టిమేట్ల ప్రకారం డబ్బులు చెల్లించినప్పటికీ 12,293 మంది రైతులు కనెక్షన్ ఎప్పుడిస్తారో తెలియక విద్యుత్ అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

తొమ్మిది నెలల్లో 1,474 కనెక్షన్లు

కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు తొమ్మిది నెలలు పూర్తవుతోంది. ఈ మధ్య కాలంలో ఇచ్చిన కనెక్షన్లు 1,474 మాత్రమే. కర్నూలు జిల్లాలో 1,002, నంద్యాల జిల్లాలో 472 మాత్రమే విడుద లయ్యాయి. నిబంధనల ప్రకారం సీనియారిటీకి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉన్నా.. టీడీపీ నేతల జోక్యం తో అర్హులకు అన్యాయం జరుగుతోందని తెలుస్తోం ది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా వైఎస్సార్‌సీపీ వాళ్లకు ఎలాంటి పనులు చేయరాదని బహిరంగంగా చెప్పడంతో కింది స్థాయి టీడీపీ నేతలు మరింత చెలరేగిపోతున్నారు.

పేరుకుపోతున్న దరఖాస్తులు

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు వేలాది రూపాయలు చెల్లించారు. ఉమ్మడి జిల్లాలో 12,293 మంది రైతులు తమ వాటా మొత్తం చెల్లిం చి కనెక్షన్ల కోసం నిరీక్షిస్తున్నారు. కర్నూలు జిల్లాలో 7,642, నంద్యాల జిల్లాలో 4,651 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉండిపోయాయి. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు మరో 6వేల మంది ఉన్నారు. ఈ రైతులకు సంబంధించి విద్యుత్ అధికారులు ఎస్టిమేట్లు వేసి డిమాండ్ నోటీసులు ఇస్తే తమ వాటా సొమ్ము చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే వ్యవసాయ విద్యుత్‌పై అలసత్వం రైతు లను ఆందోళనకు గురిచేస్తోంది.

తూతూమంత్రంగా ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర మెటీరియల్

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు కండక్టర్, కేబుల్ కొరత ఉంది. 2024 జూలై 25 నాటి వరకు పెండిం గ్‌లో ఉన్న వాటికి ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా అయ్యాయి. పెండింగ్‌లో ఉన్న మొత్తం కనెక్షన్ లకు ఇంకా 1,900 ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం. ఈ ట్రాన్స్‌ఫార్మర్లు ఎప్పటికి వస్తాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. 2వేల కిలోమీట ర్లకు కండక్టర్, కేబుల్ అవసరం కాగా.. ఇం దుకోసం రైతులు తగిన మొత్తాన్ని చెల్లించారు. అయితే సరఫరా చేయడంలో ప్రభుత్వం చేతులె త్తేస్తోంది.

గత తొమ్మిది నెలల్లో ఇదీ పరిస్థితి..

విడుదల చేసిన విద్యుత్ కనెక్షన్లు	డివిజన్	ఏడాది కాలంగా నిరీక్షిస్తున్న రైతుల సంఖ్య
341	ఆదోని	3,766
310	కర్నూలు టౌన్	1,220
351	ఎమ్మిగనూరు	2,656
179	నంద్యాల	2,427
164	ఆత్మకూరు	867
129	డోన్	1,357
1,474	మొత్తం	12,293

ట్రాన్స్‌పార్మర్లు కాలిపోతే దక్కులేదు

కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు మెటీరియల్ కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇదే సమయంలో పాత కనెక్షన్లకు సంబంధించి ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతే వెంటనే ఇచ్చే పరిస్థితి కూడా లేకుండా పోయింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వ డానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చింది. నాటి ప్రభుత్వ ఆదేశాల మేరకు దళారీల ప్రమేయం లేకుండా.. రైతుల నుంచి ఒక్క రూపాయి వసూలు చేయకుం డా ట్రాన్స్‌ఫార్మర్లను సరఫరా చేసి ఏర్పాటు చేయడం విశేషం. నిబంధనల ప్రకారం ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోయినప్పుడు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు 24 గంటల సమయం ఉంటుంది. ఇప్పుడు వారం రోజులు దాటినా ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేయలేని పరిస్థితి.

మే చివరికి పూర్తి చేస్తాం



వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు ప్రక్రియ మొదలైం ది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 1,474 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు విడుదల చేశాం. ఇంకా 12,293 కనె క్షన్లు ఇవ్వాల్సి ఉంది. మే నెల చివరికి పూర్తి చేస్తాం. సీనియారిటీ ప్రకారం కనెక్షన్లు ఇస్తాం.

– ఉమాపతి, ఎస్ఇ, విద్యుత్ శాఖ, కర్నూలు జిల్లా

పొదుపు సంఘం లీడర్లు డబ్బులు స్వాహా చేశారు



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: కృష్ణ వర్ష పొదుపు సంఘంలో రూ.8 లక్షలు అప్పు తీసుకుని ప్రతి నెలా కంతులు చెల్లిం చాం. పొదుపు సంఘంలోని లీడర్లు ఆ డబ్బును బ్యాంకుకు చెల్లించకుండా మోసం చేశారని, బ్యాం కు నుంచి తమకు నోటీసులు వచ్చాయని కర్నూలు నిర్మల్ నగర్‌కు చెందిన పల్లవి, రషీద, విజయలక్ష్మి, మరికొంతమంది పొదుపు సంఘం సభ్యులు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. కర్నూలు రెం డవ పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యా లయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి వారితో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలు సుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్య క్రమానికి మొత్తం 94 ఫిర్యాదులు వచ్చాయి. వాట న్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి బాధితు లకు తగిన న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరాతో పాటు సీఐలు కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...


- నీటిపారుదల శాఖలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని కర్నూలుకు చెందిన సూర్యమాధవ రావు రూ.6.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.
- వాటర్ ప్లాంట్ ఫిట్టింగ్ చేస్తానని చెప్పి రూ.లక్ష తీసుకుని కర్నూలుకు చెందిన వారిషా వాటర్ టెక్స్ మున్నా మోసం చేశాడని కర్నూలు మద్దూర్ నగర్‌కు చెందిన రామ్మూర్తి ఫిర్యాదు చేశారు.
- నా పెద్ద కుమారుడు ఇల్లు రాసివ్వాలని ఇంటి కొళాయి పన్నులు కట్టకుండా ఇంటి పట్టా తీసుకెళ్లి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కర్నూలు కొత్తపే టకు చెందిన సుంకులమ్మ ఫిర్యాదు చేశారు.

కోడుమూరు హెచ్‌డబ్ల్యూఓ సస్పెన్షన్

కర్నూలు(అర్బన్): కోడుమూరు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఇద్దరు విద్యా ర్థులను పదో తరగతి విద్యార్థి చితకబాదిన ఘట నకు సంబంధించిన వీడియోలు ఈ నెల 24న సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా వసతి గృహ సంక్షేమాధికారి జి.రాముడును సస్పెండ్ చేశారు. వసతి గృహంలో ఉంటున్న 10వ తరగతి విద్యార్థి మహేష్ 7, 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పి.రాజు, జె.ఇ సాక్‌పై భౌతికంగా దాడి చేశారు. బెల్ట్‌తో ఇష్టాను సారం కొట్టిన దృశ్యాలు సామాన్య ప్రజలతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల వాట్సాప్‌లకు చేరా యి. ఘటన ఈ నెల 11న జరిగినప్పటికీ ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకురాకపోవడం, వసతి గృహ నిర్వహణలో సరైన పర్యవేక్షణ లేకపోవడం, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా రాముడును సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వు ల్లో పేర్కొన్నారు. గూడూరు ఎస్సీ బాలుర వసతి గృహ సంక్షేమాధికారి పి.వలికి కోడుమూరు వసతి గృహ సంక్షేమాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

27 నుంచి ఉగాది ఉత్సవాలు

- శ్రీశైలానికి భారీగా చేరుకుంటున్న కన్నడ భక్తులు
- భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేపట్టిన దేవస్థానం



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం మహా క్షేత్రంలో ఈనెల 27వ తేదీ నుంచి ఉగాది మహోత్సవాలు జరగను న్నాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో పాల్గొనేందుకు కన్నడిగులు వేలాది మం ది తరలివస్తున్నారు. ఈనెల 31వ తేదీ వరకు జరిగే మహోత్సవాల్లో ప్రతిరోజు స్వామి అమ్మవార్లకు విశేష వాహన సేవ నిర్వహిస్తారు. అలాగే కన్నుల పండువగా గ్రామోత్సవం సైతం నిర్వహించను న్నారు. ఉగాది మహోత్సవాల్లో వీరాచారా విన్యా సాలు, పంచాంగ శ్రవణం, స్వామి అమ్మవార్లకు రథోత్సవం తదితర కార్యక్రమాలు ప్రధానమైనవి. కన్నడ భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం ఈనెల 17వ తేదీ నుంచి 26వ తేదీ వరకు శ్రీశైలం మల్లికా ర్జున స్వామి వారి స్పర్శ దర్శనానికి అనుమతిం చారు. విడతల వారీగా నిర్దిష్ట వేళలలో, 10 రోజుల పాటు కన్నడ భక్తులు మల్లన్నను స్పర్శ దర్శనం చేసుకునేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. మహోత్సవాలను పురస్కరించుకుని కన్న డిగుల సౌకర్యార్థం, శ్రీశైల దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు కల్పించిన సౌకర్యాలను యథావిధిగా ఉగాది మహోత్సవాలకు అమలు చేస్తోంది. క్షేత్ర పరిధిలో తాత్కాలిక వసతి కోసం పలు ఉద్యానవ నాల్లో, ఖాళీ ప్రదేశాలలో షామియానాల ఏర్పాటు చేసింది. భక్తులకు ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర దర్శనం తో పాటు మల్లన్న స్పర్శ రూ.500 టికెట్ కౌంటర్ సైతం ఏర్పాటు చేసింది. భక్తులకు సౌకర్యవంత మైన స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశామని ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. కన్నడ భక్తులు దేవస్థానానికి సహకరించేలా శ్రీశైల జగద్గురు పీఠాధిపతి వారి ప్రసంగ వీడియోని ఎల్ ఈడీ స్క్రీన్ ద్వారా ప్రసారం చేస్తున్నామన్నారు.

క్రికెట్ బెట్టింగ్ మాయలో పడకండి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: క్రికెట్ బెట్టింగ్ మాయలో యువత పడొద్దని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. ఐపీఎల్ టీ20 క్రికెట్ మ్యాచ్‌లను ఆసరాగా చేసుకుని మోసగించేం దుకు క్రికెట్ బెట్టింగ్ ముఠాలు పనిచేస్తున్నాయని తెలి పారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. క్రికెట్ బెట్టింగ్ యాప్స్‌తో త్వరగా డబ్బు సం పాదించాలనే ఆశతో అనేకమంది అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. తక్కువ పెట్టుబడి పెట్టి ఎక్కువ లాభాలు సాధించవచ్చు అనే ఆశలు చూపిస్తూ ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. చట్ట విరుద్ధమైన బెట్టింగ్ యాప్స్ ప్రభావంతో కొం దరు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ ముఠా లను అణచివేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. సమాచారం స్థానిక పోలీసులకు గాని, డయల్ 100/112కు అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

విజయవాడ వెళ్లిన ఎస్పీ

జిల్లాలో శాంతిభద్రతలు, అభివృద్ధి అంశాలపై చర్చిం చేందుకు ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం సాయంత్రం విజయవాడ వెళ్లారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో రెండు రోజుల పాటు విజయవాడలో సీఎం సమీక్ష సమా వేశం నిర్వహించనున్నట్లు సమాచారం. నివేదికను రూపొందించుకుని ఎస్పీ వెళ్లినట్లు తెలుస్తోంది.

పాల సేకరణ ధర పెంపు

నంద్యాల(అర్బన్): పాల సేకరణ ధరను పెంచి నట్లు విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పాల ఉత్పత్తి దారుల పరస్పర సహాయ సహకార సమితి ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కేజీ వెన్న శాతం ప్రకారం గేదె పాలు లీటరుపై రూ.1.20 నుంచి రూ.2, ఆవు పాలు లీటరుపై రూపాయి పెం చామన్నారు. మార్చి 16వ తేదీ నుంచే ఈ ధర అమల్లోకి వచ్చిందన్నారు. పాడి రైతులకు పశు పోషణకు సంబంధించి అన్ని ధరలు పెరిగినం దున పాల సేకరణ ధరను పెంచుతూ నిర్ణ యం తీసుకున్నామన్నారు. ఈ అవకాశాన్ని పాల ఉత్పత్తి దారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ధరలు కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప జిల్లాల్లో పాలు పోస్తున్న రైతులందరికీ వర్తిస్తాయన్నారు.

పేదలకు 'అదనపు' మోసం

- ఇళ్ల స్థలాల కోసం జిల్లాలో 39 వేల మంది దరఖాస్తు
- ఒక్కరికీ మంజూరు కాని ఇంటిస్థలం
- ప్రజలను మభ్యపెట్టేందుకే అదనపు సాయం

కర్నూలు(సెంట్రల్): పేదలకు ఇళ్లస్థలాలు అందడం లేదు. ఎన్నికల సమయంలో ఒక మాట చెప్పిన టీడీపీ నేతలు.. అధికారంలోకి వచ్చాక అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. పేదలు ఎవరూ ఇం టిస్థలం కావాలని అడగకుండా ఇంటి నిర్మాణం కోసం అదనపు సాయం ఇస్తామని మోసం చేస్తు న్నారు. ఇళ్ల స్థలాల కోసం జిల్లాలో ఇప్పటి వరకు 39 వేల మంది పేదలు సచివాలయాల్లో దరఖాస్తు చేసు కున్నారు. అయితే ఒక్కరికీ కూడా ఇంటిస్థలం మం జూరు చేయలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలు, కులాలకు అతీతంగా సిక్స్ స్టెప్ వ్యాలిడేట్ ఆధారంగా ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. జిల్లాలో ఏకంగా 48 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇంటి నిర్మాణం కోసం పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే ఇళ్లస్థలాలు మంజూరు చేయడం లేదు. కొత్తగా మం జూరు చేసే ఇళ్ల స్థలాలను టీడీపీ నాయకులు, కార్యక ర్తలకు ఇవ్వొచ్చనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు విమర్శలు వస్తున్నాయి.

పేరు మార్చి వంచన

జగనన్న కాలనీలపై టీడీపీ అధినేత చంద్ర బాబు నాయుడు నోరు పారేసుకున్న సంద ర్భాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా పేదలకు ఇచ్చిన సెంటున్నర స్థలం బాత్ రూమ్ నిర్మాణా నికి కూడా సరిపోదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అప్పట్లో దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. అధికారంలోకి రాగానే అదే జగనన్న కాలనీల పేర్లను ఎన్‌టీఆర్ కాలనీలుగా మార్చారు. ఇప్పుడు అదే ఇళ్ల నిర్మాణానికి అద నపు సాయం చేసి తాను ఇచ్చిన మేజర్ హామీలను పక్కదారి పటిస్తున్నారు. స్థలం లేని పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాం తాల్లో 3 సెంట్లు ఇస్తానని, ఇంటి నిర్మాణం కోసం రూ.4 లక్షలు ఇస్తానని చెప్పినా హామీలను ఎవరూ అడగరు అనే కోణంలో అద నపు సాయం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మభ్యపెట్టేందుకే అదనపు సాయం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 48 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఇందులో 39వేల మందికి పీఎంఏవై అర్బన్–వైఎస్సార్ జగ నన్న పేరిట ఇళ్లను మంజూరు చేశారు. అందులో దాదాపు 22 వేల ఇళ్లనిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 16 వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ అధినేత చం ద్రబాబునాయుడు వాటిని తానే పూర్తి చేశానని చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగం గా ఇటీవల ఇళ్ల నిర్మాణాలకు అదనపు ఆర్థిక సాయం పేరిట జీఓ నంబర్ 9 విడుదల చేశారు. ఈ జీఓ ప్రకారం ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలకు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.70 వేలను మంజూరు చేస్తారు. ఇందులో భాగంగా జిల్లాలో 5,170 మంది బీసీలు, 4,028 మంది ఎస్సీలు, 248 మంది ఎస్టీ లబ్ధిదారులు మొత్తం 9,446 మందికి అదనపు సాయంగా మొత్తం 47. 85 కోట్లు మంజూరు అవుతాయి. అయితే అదనపు సాయం చేయడంలో పెద్ద మతలబు ఉంది. ఆయన తాను అధికారంలోకి వస్తే పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తానని ఇచ్చిన హామీ లను హుళక్కి చేయవచ్చే పన్నాగం ఉంది. ఎన్టీఆర్ కాలనీల్లోని ఇళ్లను పూర్తి చేస్తే ఇంకా ఎవరూ ఇంటి స్థలం కావాలని అడగరని, ఇంటి నిర్మాణం కోసం రూ.4 లక్షలు ఇవ్వాలని కోరరనే అదనపు సాయా నికి పూనుకున్నట్లు తెలుస్తోంది.



ఓర్వకల్లులోని జగనన్న కాలనీ

ప్రభుత్వంపై వ్యతిరేకత



సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకా రం పట్ట ణాల్లో 2, గ్రామీణ ప్రాంతా ల్లో 3సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వా లి. ఇంటి నిర్మాణం కోసం రూ.4 లక్షలు ఇవ్వాలి. మం జూరయ్యే ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణ వ్యయాలను టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఇస్తే ప్రజలు తిర గబడతారు. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది.

– రామకృష్ణారెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి, కర్నూలు

నిబంధనల మేరకు ఇళ్లస్థలాలు



పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చేం దుకు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. గతంలో ఎక్కడా ఇంటి స్థలం పొందని వారికే కొత్త జాబి తాలో చోటు ఉంటుంది. ఎన్టీ ఆర్ కాలనీల్లో ఇళ్ల స్థలం ఉన్న వారు అనర్హులు అవు తారు. నిబంధనలు మేరకు ఇళ్లస్థలాలు ఇవ్వను న్నాం.

– పి.రంజిత్‌బాషా, కలెక్టర్, కర్నూలు

ప్రమాదవశాత్తూ విద్యార్థి మృతి


మృతి చెందిన విద్యార్థి విరాట్

కొలిమిగుండ్ల: గొర్విమానుపల్లె గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తూ ఓ విద్యార్థి మృతి చెందాడు. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అవుల బ్రహ్మయ్య, పార్వతి దంపతులు కుమారుడు విరాట్ యాదవ్ (13) గ్రామంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్నాడు. సోమవారం ఇంటి వద్ద ఉన్న కుళాయికి నీళ్లు వస్తుండటంతో మోటర్ సాయంతో పట్టుకున్నారు. ఆ తర్వాత విరాట్ విద్యుత్ బోర్డులో నుంచి మోటర్‌కు చెందిన ప్లగ్ బయటకు తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఇంటి ముందున్న సీసీ రోడ్డుపై పడ్డాడు. ఈ క్రమంలో బాలుడి తలకు తీవ్ర గాయమైంది. చికిత్స కోసం కుటుంబ సభ్యులు తుమ్మలపెంట సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరికి చెందిన ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం


రైలు పట్టాలపై ఈరన్న మృతదేహం

కోసిగి: గూడ్స్ రైలు ఢీకొని తలారి ఈరన్న (60) అనే వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దుర్ఘటన సోమవారం చోటు చేసుకుంది. జుమ్మాలదిన్నె గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఆరోగ్యం సరిగ్గా లేక పోవడంతో ఈరన్న కోసిగి ప్రభుత్వ హాస్పిటల్‌లో వైద్యం చేయించుకుని మందులు తీసుకెళ్లాలని ఆటోలో బయలు దేరారు. గూడ్స్ రైలు వస్తుండటంతో కోసిగి రైల్వే గేటు వేశారు. ఈరన్న ఆటో దిగి.. గూడ్స్ రైలు చాలా దూరంగా వస్తుందని పట్టాలు దాటే ప్రయత్నం చేశారు. ఈలోగా గూడ్స్ రైలు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపారు. ఈరన్నకు భార్య లక్ష్మీ, ఒక కొడుకు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

కార్మికుల పని వేళలను మార్పు చేయాలి

- కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ యం బాలునాయక్



కర్నూలు(అర్బన్): వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని వివిధ కర్మాగారాలు, బహిరంగ ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికుల పని వేళల్లో మార్పు చేయాలని కార్మిక శాఖ కర్నూలు జోన్ సంయుక్త కమిషనర్ యం.బాలునాయక్ యాజమాన్యాలను కోరారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల రక్షణకు యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలోనే విపత్తుల నివారణ సంస్థ హెచ్చరికలకు అనుగుణంగా రాష్ట్ర కార్మిక కమిషనర్ శేషగిరిబాబు కూడా ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారన్నారు. కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాల్లో చల్లని నీరు, నీడ వసతి కల్పించాలని, అలాగే వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకొని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, అత్యవసర మందులను సమకూర్చుకోవాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ ప్రదేశాల్లో పనిచేస్తున్న కార్మికుల పనివేళల్లో మార్పు చేయాలన్నారు. డీహైడ్రేషన్ నివారణ మార్గాలపై అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

క్యాంపస్ సెలక్షన్‌లో ఎంపిక కాలేదని..

- ఐఐటీ విద్యార్థి ఆత్మహత్య


అరుణ్ కుమార్ (ఫైల్)

ప్యాపిలి: తన కలలు నెరవేరడం లేదనే బెంగతో ఓ ఐఐటీ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్యాపిలి మండలం ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన సుధాకర్, సుధారాణి దంపతుల ఒక్కగానొక్క కుమారుడు మరమేసి అరుణ్ కుమార్ (23) పంజాబ్‌లోని రోపర్ యూనివర్సిటీలో ఐఐటీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సెమిస్టర్ పరీక్షల్లో ఒక్క సబ్జెక్టు బ్యాక్‌లాగ్‌లో ఉండటంతో ఇటీవల జరిగిన క్యాంపస్ సెలక్షన్‌లో ఎంపిక కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అరుణ్ కుమార్ తనపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు తన ముఖం ఎలా చూపించాలని తరచూ స్నేహితులతో చెప్పి బాధపడేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 15న పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో చేరుకున్నాడు. గమనించిన తోటి మిత్రులు పంజాబ్‌లో ఓ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. కాగా పరిస్థితి విషమించడంతో అరుణ్ కుమార్ శనివారం రాత్రి మృతి చెందాడు. దీంతో అతడి మృతదేహాన్ని సోమవారం స్వగ్రామానికి తీసుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. చెట్టంత కొడుకు విగతజీవిగా మారడంతో ఆ యువకుడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఎల్లెల్సీలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

- డ్రైవర్ సురక్షితం



పెద్దకడబూరు: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)లోకి ట్రాక్టర్ అదుపు తప్పి దూసుకెళ్లి బోల్తా పడింది. పెద్దకడబూరు మండలం మేకడోణ గ్రామ సమీపంలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ట్రాక్టర్ డ్రైవర్ అప్రమత్తమై దూకడంతో ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డాడు. మేకడోణ నుంచి పెద్దతుంబళం వైపు వెళ్తూ.. ఎల్లెల్సీ గట్టుపై అతివేగంగా ట్రాక్టర్‌ను నడపడంతోనే ఈ ప్రమాదం జరిగింది.


శ్రీగిరికి చేరువైన పాదయాత్ర భక్తులు

శ్రీగిరి మల్లన్నా.. శరణు.. శరణు!




కైలాస ద్వారం వద్దకు చేరుకుంటూ..

కన్నడ భక్తుల శివనామస్మరణతో శ్రీశైల క్షేత్రం మారుమోగుతోంది. ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తండోపతండాలుగా శ్రీగిరి చేరుకుంటున్నారు. నల్లమల మీదుగా పాదయాత్ర చేసుకుంటూ కైలాస ద్వారం చేరుకుని మల్లన్న చెంతకు వడివడిగా అడుగులు వేస్తున్నారు. వేలాది మంది భక్తులు పాతాళ గంగలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి అమ్మవార్ల దర్శనానికి బారులుదీరుతున్నారు. కన్నడ భక్తులు మల్లన్న ను స్పర్శ దర్శనం చేసుకునేందుకు ఎంతో ఆరాట పడతారు. అందులో స్వామి వారి స్పర్శ దర్శనానికి అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఈ నేపథ్యంలో కన్నడ భక్తుల సౌకర్యార్థం ఈ నెల 26వ తేదీ వరకు మల్లన్న స్పర్శ దర్శనానికి అనుమతి కల్పించారు. అయితే మరో రెండు రోజుల్లో ముగిస్తుండడంతో కన్నడ భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. అంతేకాకుండా క్షేత్రంలో భక్తులు పెరగడంతో మొబైల్ ఫోన్ సిగ్నల్స్ పని చేయడం లేదు. దీంతో భక్తులు సమాచారం తెలుసుకోక అవస్థలు పడుతున్నారు. – శ్రీశైలంటెంపుల్


భుజాలెక్కి మల్లన్న దర్శనానికి..


శ్రీశైలం వైపు చిన్నారుల అడుగులు..


నల్లమల మీదుగా పాదయాత్రగా వస్తున్న భక్తులు


భక్తజనసంద్రమైన శ్రీగిరి పుర వీధులు


కర్రలపై నిలిచి నడుచుకుంటూ..

పదో తరగతి విద్యార్థికి బ్రెయిన్ స్ట్రోక్

- ఇప్పటికే ఒక ఆపరేషన్ చేసిన వైద్యులు
- వర్తించని ఎన్‌టీఆర్ వైద్యసేవ
- ఆదుకోవాలంటున్న తల్లిదండ్రులు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రిషికేష్


రిషికేష్(ఫైల్)

కర్నూలు(హాస్పిటల్): ఆ విద్యార్థి ఎన్నో ఆశలతో పదో తరగతి పరీక్షలకు సిద్ధమయ్యాడు. కొన్ని పరీక్షలు కూడా రాశాడు. సోమవారం జరగాల్సిన పరీక్ష కోసం పాఠశాలకు వెళ్లి తిరిగి వచ్చి ఇంట్లో కుప్పకూలిపోయాడు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది వెంటనే కుమారుడిని కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. విద్యార్థికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని, రూ.10లక్షల దాకా ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో దాతల కోసం తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. వివరాలు.. పాములపాడు మండలం ఎర్రగూడూరు గ్రామానికి చెందిన వెంకట నాగయ్య, జి.పరిమళలు తమ కుమారుడైన జి. రిషికేష్ చదువు కోసం కర్నూలు నగరంలోని టెలికాంనగర్‌లో నివాసం ఉంటున్నారు. నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతంలోని ఒక స్కూల్‌లో జి. రిషికేష్,, 10వ తరగతి చదువుతున్నాడు. కర్నూలు నగరంలోని ఒక సెంటర్‌లో ఈ నెల 17వ తేదీ నుంచి పరీక్షలు రాస్తున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసి సోమవారం పరీక్షకు సిద్ధం కావాల్సి ఉందని చదువుతున్న పాఠశాలకు వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు అక్కడే చదువుకుని ఏడు గంటలకు ఇంటికి వస్తూనే తనకు విపరీతమైన తలనొప్పి వస్తోందని తల్లిదండ్రులకు చెబుతూ అలాగే మంచంపై వాలిపోయాడు. కొద్దిసేపటికి చూసే సరికి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. వెంటనే తల్లిదండ్రులు కుమారున్ని కర్నూలు నగరంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్యపరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ఆ బాలుని మెదడులో నరం వాచి చిట్లిపోయినట్లు గుర్తించారు. వెంటనే అదేరోజు రాత్రి ఆపరేషన్ చేసి మెదడులో లీకైన రక్తాన్ని తొలగించారు. త్వరలో మరో ఆపరేషన్‌కు సిద్ధంగా ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. అయినా ఇప్పుడే ఏమీ చెప్పలేమని, ధైర్యంగా ఉండాలని పేర్కొన్నారు. చికిత్సకు ఎన్‌టీఆర్ వైద్యసేవ వర్తించదని, ఇందుకోసం రూ.10లక్షల దాకా ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో పేదలైన తాము అంత డబ్బు ఎక్కడ నుంచి తీసుకురావాలని, దాతలు స్పందించి తన కుమారున్ని ఆదుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ముగిసిన మంగళ మహోత్సవం




వేదికపై ప్రసంగిస్తున్న పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, ప్రశంసా అవార్డులతో విద్యార్థులు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో శ్రీమన్ న్యాయసుధా మంగళ మహోత్సవం సోమవారం ముగిసింది. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల నేతృత్వంలో రెండు రోజుల పాటు ఈ ఉత్సవం నిర్వహించారు. వివిధ మఠాధిపతులు సమక్షంలో శ్రీమన్ న్యాయసుధా గ్రంథంపై తర్క , సారాంశ ఘోష్టి జరిపారు. మహోత్సవంలో ఉత్తమ ప్రతిభ చాటిన ఎనిమిది మంది విద్యార్థులకు ప్రశంసా పత్రం, అవార్డులు ప్రదానం చేశారు. అంతకు ముందు ఊంజల మంటపంలో రాఘవేంద్రుల విరాట్‌కు పీఠాధిపతులు విశేష పూజలు చేపట్టారు. వేడుకలో వ్యాసరాజ మఠం పీఠాధిపతి విద్యాశ్రీషా తీర్థులు, శ్రీపాదరాజ మఠం పీఠాధిపతి సుజయనిధి తీర్థులు, కృష్ణాపుర మఠం పీఠాధిపతి విద్యాసాగర తీర్థులు, కనియూరు మఠం పీఠాధిపతి విద్యావల్లభతీర్థులు, శిరూర్ మఠం పీఠాధిపతి వేద వర్ధన తీర్థులు, అధమారు మఠం పీఠాధిపతి ఈషా ప్రియ తీర్థులు, బందరకెరె మఠం పీఠాధిపతి విద్యేశ తీర్థులు , కన్వమఠం పీఠాదిపతి విద్యాకన్వ విరాజ తీర్థులు, బాలఘర్ మఠం పీఠాధిపతి అక్షోభ్య రామ ప్రియ తీర్థులు , చిత్తాపూర్ మఠం పీఠాధిపతి విద్యేంద్ర తీర్థులు, ఉడిపి మఠం పీఠాధిపతులు బన్నంజే రాఘవేంద్ర తీర్థులు, వామన తీర్థులు పాల్గొన్నారు.

బిల్లులు ఇవ్వకుండా 'సాగు'తీత

- ఉమ్మడి జిల్లాకు అందని రూ. 50 లక్షల బిల్లులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఇంజినీర్లు

కర్నూలు సిటీ: సాగునీటి సంఘాలకు జల వనరుల శాఖ ఇంజినీర్లు అప్పులు చేసి గతేడాది డిసెంబరులో ఎన్నికలు నిర్వహించారు. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం బిల్లులు ఇవ్వకుండా చోద్యం చూస్తోంది. దీనిపై పలువురు ఇంజినీర్లు ఆగ్రహంగా ఉన్నారు. కర్నూలు జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ పరిధిలో 58 నీటి వినియోగదారుల అసోసియేషన్లు, కేసీ కెనాల్ పరిధిలో 2, ఆలూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలో 6, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం 3, గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలోన 12, చిన్న నీటిపారుదల శాఖ పరిధిలో 42 నీటి వినియోగదారుల అసోసియేషన్లకు ఎన్నికలు నిర్వహించారు. వీటితో పాటు 1,212 ప్రాదేశిక నియోజకవర్గాలకు, 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు , రెండు ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించారు. సుమారుగా రూ.22 లక్షలు ఖర్చు అయ్యాయి. అలాగే నంద్యాల జిల్లాలో 166 నీటి వినియోగదారుల అసోసియేషన్లకు, 1,600 ప్రాదేశిక నియోజకవర్గాలకు, 38 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 4 ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించారు. సుమారుగా రూ.28 లక్షలకుపైగా ఖర్చు వచ్చింది. ఎన్నికలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం రాజకీయం చేసి టీడీపీకి చెందిన వారికి పదవులు ఇచ్చింది. తొలుత ఎన్నికలు నిర్వహించేందుకు ముందుగానే బడ్జెట్ కేటాయిస్తామని ప్రభుత్వం చెప్పింది. ఎన్నికలు ముగిసి మూడు నెలలు దాటినా కూడా ఇంత వరకు బిల్లులు రాకపోవడంతో ఇంజినీర్లు ఆందోళన చెందుతున్నారు.

దుఃఖంలో 'పరీక్ష'


విద్యార్థిని చాకలి మమత

కృష్ణగిరి: అల్లారుముద్దుగా పెంచిన తండ్రి మృతి చెందడంతో కన్నీటి పర్యంతో ఓ విద్యార్థిని పరీక్షకు హాజరయ్యారు. తండ్రి కలను సాకారం చేయాలనే సంకల్పంతో దుఃఖాన్ని దిగమింగుకుని సోమవారం పరీక్ష రాశారు. కృష్ణగిరి మండల కేంద్రానికి చెందిన చాకలి మమత స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతూ ప్రస్తుతం పరీక్షలు రాస్తోంది. విద్యార్థిని మమత తండ్రి చాకలి మద్దిలేటి(40) వారం క్రితం అనారోగ్యం (పక్షవాతం)తో మంచం పట్టి ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. ఇంట్లో తండ్రి మృతదేహం ఉండగా తండ్రి కలను సాకారం చేయాలనే సంకల్పంతో చదువుకుని సోమవారం నాటి లెక్కల (మ్యాథ్స్) పరీక్షకు మమత హాజరయ్యారు. పరీక్ష రాసిన అనంతరం జరిగిన తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. విద్యార్థినికి తల్లి లక్ష్మి, ఇంటర్ చదివే సోదరి, ఏడో తరగతి చదివే సోదరుడు ఉన్నారు.

కోర్టు స్టేను అమలు చేయాలి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి


జేసీకి వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మండలంలోని కె. మార్కాపురం, తడకనపల్లె గ్రామాలకు సంబంధించిన రేషన్ షాపులకు సంబంధించి కోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్ అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. కోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్ అమలు చేయకుండా కొందరు అధికారులు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. కాటసాని వెంట రేషన్ డీలర్లు, గ్రామ నాయకులు ఉన్నారు.

మహానందిలో కన్నడిగుల అవస్థలు


ఆలయం ముందు ఆరుబయటే నిద్రిస్తున్న భక్తులు

మహానంది: ఉగాది ఉత్సవాలకు శ్రీగిరికి చేరుకున్న భక్తులు తిరుగు ప్రయాణంలో మహానందీశ్వరుడిని దర్శించుకునేందుకు మహానందికి తరలివస్తున్నారు. స్థానిక రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుంటున్నారు. కాగా ఆలయ ప్రాంగణంలో సరైన వసతులు లేకపోగా, గదులు తీసుకోవడానికి ఆర్థిక స్థోమత లేని భక్తులు చేసేదేమిలేక ఆలయం ముందు భాగంలో, సుపథ మండపాల్లో సేద తీరుతున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి వచ్చే పేద భక్తులకు అధికారులు వసతి కల్పించాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

- రిమాండుకు ఆదేశించిన కోర్టు


నిందితులను అరెస్టు చూపుతున్న ఏఎస్పీ

బండిఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్త నంద్యాల సుధాకర్‌రెడ్డి హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఏఎస్పీ కార్యాలయంలో సోమవారం నిందితులను చూపించారు. ఈ సందర్భంగా నంద్యాల ఏఎస్పీ మందజావళి మాట్లాడుతూ.. లింగాపురం గ్రామంలో కొన్నేళ్ల నుంచి నంద్యాల సుధాకర్‌రెడ్డికి, అదే గ్రామానికి చెందిన మాల గుర్రాల రామస్వామికి స్థలం విషయంలో గొడవ ఉండేదన్నారు. స్థలాన్ని ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో రామస్వామి అతని కుమారులు.. నంద్యాల సుధాకర్‌రెడ్డిని కిరాతంగా హత్య చేసినట్లు పోలీసులు దర్యాప్తులతో తేలిందన్నారు. నిందితులైన గుర్రాల రామస్వామి, అతని కుమారులు గుర్రాల శివన్న, గుర్రాల తిరుపాలు, గుర్రాల లక్ష్మన్నలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండుకు ఆదేశించినట్లు ఏఎస్పీ తెలిపారు. నిందుతులను అరెస్ట్ చేసిన సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ జగన్‌మోహన్, మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డితో పోలీస్ సిబ్బందిని అభినందించారు.

ప్రజలకు సదుపాయాలు కల్పించరా?


ధర్నా చేస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు (టౌన్): చిన్నపాటి సమస్యలపై నెలల తరబడి తిరగాల్సి వస్తోంది. అయినా సమస్యలు పరిష్కారం కావడం లేదు. పన్నులు చెల్లించే ప్రజలకు సదుపాయాలు కల్పించరా? అని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకుడు పుల్లారెడ్డి ప్రశ్నించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో వివిధ కాలనీలకు చెందిన ప్రజలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ కాలనీ, రిచ్మండ్ కాలనీ, శాంతినగర్ కాలనీలలో సదుపాయాలు కల్పించాలన్నారు. టెలికాం నగర్, బాలాజీనగర్ పార్కు, సుందరయ్య పార్కులను అభివృద్ధి చేయాలన్నారు. ఖాళీ స్థలాలను సంరక్షించి అభివృద్ధి చేయాలని, శివారు కాలనీలలో 100 మినీ వాహనాలను ఏర్పాటు చేసి ఇంటింటి చెత్త సేకరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మేయర్ బీవై రామయ్యకు, కమిషనర్ రవీంద్రబాబుకు వినతిపత్రాలు అందజేశారు.



అదుపు తప్పితే కాలువలోకే!

పిల్లిగుండ్ల, నెరుడుప్పల రహదారిలోని జీడీపీ కూడి కాలువ కల్వర్టు పూర్తిగా కుంగిపోయింది. దీంతో పాటు రక్షణ గోడ కూడా లేదు. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా కాలువలో పడిపోయే అవకాశం ఉంది. ఈ రహదారి మీదుగా పిల్లిగుండ్ల, ఒంటెడుదిన్నె, నెరుడుప్పల, ఎర్రబాడు, దేవనకొండ మండలం కేంద్రంతో పాటు ఆయా గ్రామాలకు వెళ్తుంటారు. అయితే ఆ కాలువ దగ్గర రోడ్డు మలుపు ఉండడం, కల్వర్టుకు రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. పైగా కల్వర్టు పూర్తిగా కుంగిపోయింది. అలాగే కల్వర్టు కింద, పక్కన గట్టు పూర్తిగా దెబ్బతినడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని వాహనదారులు భయందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయంలో అయితే వాహనదారులు భయపడుతూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి కుడి కాలువకు నూతన కల్వర్టుతో పాటు రక్షణ గోడ నిర్మించాలని, దెబ్బతిన్న కాలువ గట్టుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

– గోనెగండ్ల